## క్లుప్తంగా

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



గందోడివారిపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**తనకల్లు:** సాగునీటి సంఘం ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ బయప్ప, ఎంపీడీఓ రెడ్డెప్ప మాట్లాడుతూ చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు (సీజీ ప్రాజెక్టు), చిన్న రామన్నగారిపల్లి(సీఆర్ పల్లి), మల్లిరెడ్డిపల్లి, తిమ్మనాయునిచెరువు (కొక్కంటి), దిగువ చెక్కవారిపల్లి సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. ఆయా చెరువుల కింద సాగు చేస్తున్న రైతులు తమ వన్‌బీని గుర్తింపు కోసం తీసుకొచ్చి ఓటు వేయవచ్చని తెలిపారు. పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీహరినాయక్, వీఆర్వో నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

### సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**చెన్నేకొత్తపల్లి:** సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సురేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనుముక్కలలో రెండు, నాగసముద్రంలో రెండు చెరువులు, ముష్టికోవెల, హరియాన్ చెరువు, న్యామద్దెల, మేడాపురం, గంగినేపల్లి గ్రామాలకు చెరువులు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. అయితే అధికార పార్టీలకు చెందిన వారినే సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నుకునేలా ఆయా గ్రామాల్లోని అధికార పార్టీ నాయకులు ఓటర్లతో మంతనాలు చేసినట్లు తెలిసింది. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

### విద్యార్థినులకు భోజన వసతి



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న సంస్థ సభ్యులు, న్యాయవాది గుంటప్ప

**ధర్మవరం అర్బన్:** ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల సహకారంతో భోజన వసతి కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, న్యాయవాది గుంటప్ప వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 445 మంది విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం అందించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

**కదిరి అర్బన్:** పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్, హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తుంటారని మంచి మార్కులు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 ఓబుల్‌రెడ్డి, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ మురళీ శ్రీనివాస్, హార్ట్‌టు హెల్ప్ సంస్థ అధ్యక్షుడు రవినాయక్ పాల్గొన్నారు.

### నేడు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



యర్రంపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

**చెన్నేకొత్తపల్లి:** చెన్నేకొత్తపల్లి పంచాయతీ పరిధిలోని యర్రంపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. మూడు రోజులుగా వేద పండితుల ఆధ్వర్యంలో ఆంజనేయుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. శుక్రవారం ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

- తాడిమర్రి రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత
- ఖాళీగా తహసీల్దార్ పోస్టు
- డిప్యుటేషన్‌పై ఇద్దరు ఆర్‌ఐలు
- పట్టించుకోని ప్రభుత్వం
- ప్రజలకు తప్పని అవస్థలు



తాడిమర్రి తహసీల్దార్ కార్యాలయం

## పని జరగదు..
# పడిగాపులు తప్పవు!

**తాడిమర్రి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత నెలకొంది. దీంతో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు పనులు జరగక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో ఉన్న సిబ్బందిపై పనిభారం అధికమవుతోంది. దీంతో వారు పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. ప్రభుత్వం మరోవైపు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడంతో రెవెన్యూ కార్యాలయం వెలవెలబోతోంది. మండలంలో 31 గ్రామాలు, 14 పంచాయతీలు, 14 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 32,385 మంది జనాభా, 8,572 కుటుంబాలు ఉన్నాయి. మండలవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో 2,682 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక రైతులు 9,800 మంది ఉన్నారు. విద్యార్థులతో పాటు రైతులు వివిధ ధ్రువపత్రాల కోసం రెవెన్యూ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. అయితే రెవెన్యూ సిబ్బంది కొరతతో పనులు సకాలంలో జరగకపోవడంతో వారికి పడిగాపులు తప్పడం లేదు..

**కీలక పోస్టులన్నీ ఖాళీనే..**

తహసీల్దార్ కార్యాలయంలో ప్రధాన భూమిక పోషించే తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌తో నెట్టుకొస్తున్నారు. ఇక ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉండగా ఇందులో రీసర్వే ఆర్ఐ ధర్మవరంలోని ఆర్డీఓ కార్యాలయం, మరొకరు కలెక్టరేట్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అలాగే ఒక జూనియర్ అసిస్టెంట్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా రికార్డు అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో కార్యాలయం పనులు ఒకరు, ఇద్దరిపై పని భారం పడుతోందని సిబ్బంది వాపోతున్నారు. అసలే సిబ్బంది కొరతతో పనులు జరగక ప్రజలు అవస్థలు పడుతుంటే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు, ఫ్రీహోల్డ్ సర్వే పనిని సిబ్బందికి అప్పగించింది. దీంతో ఉన్న సిబ్బంది కూడా ప్రజలకు అందుబాటులో ఉండని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే సకాలంలో సేవలు అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలి**



తహసీల్దార్ కార్యాలయంలో తగినంత మంది సిబ్బంది లేరు. దీంతో వివిధ పనుల మీద కార్యాలయానికి వచ్చే ప్రజలకు పనులు జరగక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఒక చిన్న పని లేదా విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల కోసం పది, పదిహేను రోజులు పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం తగినంత మంది సిబ్బందిని నియమించాలి.

–కాగోళ్ల రాజు, నిడిగల్లు, తాడిమర్రి

**సిబ్బందిపై అదనపు భారం**



కార్యాలయంలో తగినంత మంది సిబ్బంది లేక తీవ్ర అవస్థలు పడుతున్నాం. దీంతో కార్యాలయం సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. వివిధ పనుల మీద కార్యాలయానికి వచ్చే ప్రజలకు సకాలంలో సమస్యలు పరిష్కరించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్, తాడిమర్రి

## అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



సూర్యం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

**రామగిరి:** నసనకోట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బోయ నారాయణప్ప అలియాస్ నసనకోట సూర్యం(65) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొన్నేళ్లుగా పెరాలసిస్‌తో బాధపడుతున్న ఈయన.. ఓ కేసు విషయమై వారం రోజులుగా పోలీసుల వేధింపులు అధికం కావడంతో దిగాలు చెందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సూర్యం మృతదేహానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. నసనకోట సూర్యం వైఎస్సార్‌సీపీ ప్రారంభం నుంచి చురుకుగా పని చేశారన్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, నాయకులు మీనుగ నాగరాజు, కురుబ ముత్యాలప్ప, రమేష్, దాసరి మోహన్, ఓబిరెడ్డి, రామలింగారెడ్డి, కెసి మల్లికార్జున, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

## ‘సాగునీటి’ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



పోలీసు, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

**ధర్మవరం అర్బన్:** సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఆర్డీఓ మహేష్ అధికారులకు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని ఇరిగేషన్ డీఈలు, ఏఈలు, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించాలన్నారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎలక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్, పోలింగ్ ఆఫీసర్, పోలీసు శాఖలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలిపారు.

**తలుపుల :** మండలంలోని పెద్దన్నవారిపల్లి, పులిగుండ్లపల్లి, కుర్లి చెరువుల సాగునీటి సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శుక్రవారం ఇరిగేషన్ ఏఈ అనీల తెలిపారు. ఏఈ మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటల నుంచి తొలుత ఆయా చెరువుల కమిటీలో సంబంధిత ఆయకట్టు రైతులు ఆరుగురు చొప్పున సభ్యులను ఎన్నుకుంటారన్నారు. మధ్యాహ్నం ఈసభ్యుల్లో ఒకరిని చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నుకొంటారని తెలిపారు. పెద్దన్నవారిపల్లికి ఏఓ షాదాబ్, పులిగుండ్లపల్లికి ఇరిగేషన్ ఏఈ హరినాథ్, కుర్లికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయమ్మను ఎన్నికల అధికారులుగా నియమించినట్లు తెలిపారు.

## సాక్షి జర్నలిస్టులపై దాడి దుర్మార్గం



విలేకర్లతో మాట్లాడుతున్న రెవెన్యూ డివిజన్ అధ్యక్షులు జానపాటి మోహన్

**ధర్మవరం:** వైఎస్సార్ జిల్లా వేముల తహసీల్దార్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజీకు వెళ్లిన సాక్షి జర్నలిస్టులపై దాడి చేసిన గుండాలను వెంటనే అరెస్టు చేయాలని ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం రెవెన్యూ డివిజన్ అధ్యక్షులు జానపాటి మోహన్, ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్‌చౌదరి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఏపీయూడబ్ల్యూజే కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి మదనాపు రామాంజనేయులు, కోశాధికారి జీవీ నారాయణ, డివిజన్ సహాయ కార్యదర్శి గోల్డ్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు సాకే శ్రీనివాసులుతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. సాగునీటి సంఘం ఎన్నికల కవరేజ్ నిమిత్తం వచ్చిన సాక్షి టీవీ శ్రీనివాసులు, కెమెరామెన్ రాములు, రిపోర్టర్ రాజారెడ్డిలపై కొంతమంది గుండాలు మూకుమ్మడిగా దాడి చేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టులపై దాడి చేయడమే కాకుండా వారి వద్ద నుంచి కెమెరాలను, సెల్‌ఫోన్లను లాక్కొని పగులగొట్టడం దుర్మార్గమన్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని ప్రభుత్వం కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుపై దాడులపై నియంత్రణ కమిటీలను ప్రభుత్వం వెంటనే నియమించాలన్నారు. రాష్ట్రంలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు.

## బహూత్తమ పద్మశాలీయ సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న సంఘం సభ్యులు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని మార్కండేయ కళ్యాణ మండపంలో శుక్రవారం బహూత్తమ పద్మశాలీయ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘం అధ్యక్షుడిగా పుత్తా రుద్రయ్య, ఉపాధ్యక్షుడిగా జింకా నాగభూషణంను పద్మశాలీయ కులస్తులు ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మార్కండేయస్వామి ఆలయ అభివృద్ధి, పద్మశాలీయ కులస్తుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామన్నారు.

# రైతు పోరుబాటకు తరలిన నాయకులు



బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో వెళ్తున్న నాయకులు



పుట్టపర్తిలో జరిగిన రైతు ర్యాలీలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో కలసి పాల్గొన్న నాయకులు



ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ బత్తలపల్లి నేతలు

**కదిరి టౌన్:** పుట్టపర్తిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన రైతు పోరుబాట కార్యక్రమానికి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, రైతులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరివెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, మాజీ సమన్వయకర్త ఎస్ఎమ్‌డీ ఇస్మాయిల్, లీగల్ సెల్ జోనల్ ఇంచార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ తోట అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు పరికి సాధిక్ బాషా, మార్కెట్ నౌషాద్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బత్తలపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రకటించిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపుమేరకు చేపట్టిన రైతు పోరుబాటకు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తరలివెళ్లారు. శుక్రవారం ఉదయం మండల కేంద్రం నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, ఉపాధ్యక్షుడు కోటి సురేష్, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు బండి నాగభూషణ, బోయపాటి సూర్యనారాయణ, వడ్డె వెంకటరాముడు, లింగమయ్య, ఈడిగ కాశప్ప, అక్కిం ముసలప్పలతో పాటు పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. రైతులకు కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

**రామగిరి:** పుట్టపర్తిలో శుక్రవారం జరిగిన ‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’ కార్యక్రమానికి పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, నసనకోట, మాదాపురం, రామగిరి, కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రి పంచాయతీల్లోని గ్రామాల నుంచి పార్టీ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కక్రాహనుమంత రెడ్డి, జెడ్పీటీసీ గోసే నాగార్జున, ఎంపీపీ మీనుగ నాగమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

**ర్యాలీకి తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు**

**కనగానపల్లి:** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పుట్టపర్తిలో శుక్రవారం నిర్వహించిన అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ర్యాలీకి రాప్తాడు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు మండలాల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు వాహనాల్లో వెళ్లారు. కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, రాప్తాడు మండలాల నుంచి పార్టీకి చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తి చేసుకుందాం



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర


**బత్తలపల్లి:** ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా కాలుష్య రహిత విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుందామని విద్యుత్ ఎస్ఈ సురేంద్ర, ఈఈ శివరాం పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యుత్ ఏఈ శివయ్య అధ్యక్షతన పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ ఎస్ఈ మాట్లాడుతూ సౌరశక్తితో ప్రతి ఇంటిపైన ఇంటి అవసరానికి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాయితీపై సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఇప్పటికే రూ.76 వేల కోట్లు కేటాయించిందన్నారు. ఉత్పత్తి చేసుకున్న విద్యుత్‌ను ఇంటి అవసరాలకు ఉపయోగించుకుంటూనే మిగిలిన విద్యుత్ ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందవచ్చన్నారు. జిల్లాలోని ఐదు పంచాయతీలను రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుకు ఎంపిక చేశామని వీటిలో ఉత్తమ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నగదు బహుమతిగా ప్రకటించిందన్నారు. ఎస్‌బీఐ బత్తలపల్లి బ్రాంచ్ మేనేజర్ సుభాష్, ఫీల్డ్ ఆఫీసర్ జాన్‌మోసెస్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ లింగన్న సూర్యఘర్ యోజనపై బ్యాంకుల ఆర్థిక చేయూతను వివరించారు. ఏడు శాతం వడ్డీతో రుణాలు అందివ్వనున్నట్లు తెలిపారు. అనంతరం సోలార్ కంపెనీలు సోలార్ ప్లేట్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. నెడ్‌క్యాప్ డీఓ కిషోర్, విద్యుత్ డీఈఈ, నరసింహారెడ్డి, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

## రోగులకు భోజన వసతి

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం సత్యసాయి సేవా సమితి సభ్యులు 380 మంది రోగులు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్ మాట్లాడుతూ దాత రిటైర్డ్ రేడియాలజిస్ట్ రామ్మోహన్‌రావు సహకారంతో భోజన వసతి కల్పించామన్నారు. అలాగే గర్భిణులకు స్వీట్లు పంపిణీ చేశామని తెలిపారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మదనపల్లి
I.A. NO.204/2023
I.A. NO 203/2023
O.S.NO 185/2015
పిటిషనర్స్ : బి.వెంకట్రమణ (Died) & వగైరాలు
//Vs//
రెస్పాండెంట్స్ : రంగాని రామప్ప వగైరాలు
నోటీస్ టూ రెస్పాండెంట్ నెం: 17
శ్రీమతి ఆర్.శివమ్మ భర్త వై.రవి, వయస్సు 38 సంవత్సరాలు, కొత్తపల్లి H/O కదిరి గ్రామం, మరియు మండలం శ్రీ సత్య సాయి జిల్లా.
పై నంబర్లు గల పిటిషన్స్ లో కోర్టు వారు మీకు పేపర్ ద్వారా నోటీసులు పంపుటకు ఉత్తర్వులను జారీచేశారు. పైపిటిషన్స్ 18/12/2024 వ తేదిన వాయిదా వున్నది కావున మీరు పైన కనపరచిన కోర్టు వారి యెదుట 18/12/2024వ తేదీన 10:30 గంటలకు స్వయంగా కానీ లేదా వకీలు ద్వారా కానీ మీ అక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీకు పరోక్షంగా ఉత్తర్వులు జారీచేయబడును.
// By Order of the Court //
D. KRISHNA REDDY, M.Com., LL.B.
Advocate, Madanapalle Cell No : 94405 82838

# చుక్కల భూముల సమస్యలు పరిష్కరించండి



కదిరి మండలం కే. బత్తలపల్లిలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ



పి.కొత్తపల్లిలో అర్జీలను స్వీకరిస్తున్న విజయశాంతిబాయ్, అధికారులు

**ఎన్పీకుంట:** పి.కొత్తపల్లి పంచాయతీలో చుక్కల భూముల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, రెవెన్యూ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు అధికారులకు అర్జీలు సమర్పించారు. పి కొత్తపల్లి సచివాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారిణి పి.విజయశాంతిబాయ్ హాజయ్యారు. ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో దీర్ఘకాలిక భూసమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. చుక్కల భూములు, సాగు రైతులకు పట్టాలు మంజూరు కోసం 32 అర్జీలు వచ్చాయని తెలిపారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆమె రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ అంజనప్ప, ఆర్ఐ శ్రీధర్, మండల సర్వేయర్లు జిలాని, ఋషిపవన్‌మూర్తి, వీఆర్‌ఓలు రఘు, అనూషా, దీపిక, గ్రామసర్వేయర్లు ఉపేంద్ర, ప్రసన్న పాల్గొన్నారు. అనంతరం అటవీ శాఖ అధికారులు ‘అడవికి నిప్పు – మానవాళికి ముప్పు’ పోస్టర్లను ఆవిష్కరించారు.

**అమడగూరు:** మండలంలోని ఎస్ కురువపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ రామనాథరెడ్డి పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం అందిన అర్జీలను 45 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. ఈనెల 17న మహమ్మదాబాద్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**కదిరి అర్బన్:** గ్రామంలోనే భూ సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ పేర్కొన్నారు. శుక్రవారం కే. బత్తలపల్లిలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. భూసమస్యలు ఉన్న ప్రజలు అర్జీలు ఇస్తే వాటిపై విచారణ చేపట్టి పరిష్కరిస్తామన్నారు. అనంతరం భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీక్రిష్ణ, ఎంపీడీఓ పోలప్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**బత్తలపల్లి:** రైతు సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. శుక్రవారం ఈదుల ముష్టూరులో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. గ్రామస్తులతో రెవెన్యూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఎంపీడీఓ నరసింహానాయుడు, సర్పంచు ముసలప్ప, మండల సర్వేయర్ జోసెఫ్, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, దేవాదాయ శాఖ అధికారిణి నాగరత్న పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220717, 9912220726, 9010593486